# హత్యా రాజకీయాలు మానుకోవాలి

- ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని ఖండిస్తున్నాం
- ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు తగదు
- భారీ మెజార్టీతో పద్మక్క హ్యాట్రిక్ పక్కా
- మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్



మెదక్‌లో మాట్లాడుతున్న మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్

మెదక్ అర్బన్, అక్టోబర్ 31: హత్యా రాజకీయాలు మానుకోవాలని మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ అన్నారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థిపై ప్రచారంలో ఉండగా కత్తితో దాడి చేయడం హేయమైన చర్య అని తీవ్రంగా ఖండించారు. మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రక్తమంతా బీజేపీదేనని, రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలని చూస్తున్నారని, ఓటమి భయంతోనే దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు అస్కారం లేదని మండిపడ్డారు. మెదక్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుంటే మెదక్ నుంచే కార్యాలయాలు తరలిపోయాయని మైనంపల్లి హన్మంతరావు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఏం చేసింద్రో చెప్పుకొని మైనంపల్లి హన్మంతరావు ప్రచారం చేయాలని డిమాండ్ చేశారు. మైనంపల్లిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. బీఆర్‌ఎస్ తలుచుకుంటే కాంగ్రెస్ నేతలు గ్రామాల్లో తిరుగలేరన్నారు. దాడులు చేస్తే ప్రతిదాడులు తప్పవని ఆయన హెచ్చరించారు. తెలంగాణ వచ్చాక జిల్లా కేంద్రం సాధ్యమైందన్నారు. ఏ ఆఫీసులు పోయినయో చర్చకు రావాలంటూ సవాల్ విసిరారు. జుటా మాటలతో ప్రజలను నమ్మించలేరని, పద్మక్క మీద దుష్ప్రచారం చేస్తే సహించేదిలేదన్నారు. భారీ మెజార్టీతో పద్మక్క హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేసే వారిపైన హత్యా రాజకీయాలు చేసే ఆలోచనలు ఇకనైనా మానుకోవాలని చంద్రపాల్ హితవు పలికారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్ నర్వ లక్ష్మీనారాయణగౌడ్, వసంతరావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు గంగాధర్, కొంగటి గట్టేశ్ తదితరులు పాల్గొన్నారు.



శంశిరెడ్డిపల్లి సర్పంచ్ శాంతి భర్త సీత్యానాయక్‌కు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి

## బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

- సొంతగూటికి శంశిరెడ్డిపల్లితండా సర్పంచ్ భర్త

వెల్దుర్తి, అక్టోబర్ 31: వెల్దుర్తి మండల పరిధిలోని శంశిరెడ్డిపల్లి తండా సర్పంచ్ శాంతి భర్త సీత్యానాయక్ సొంత పార్టీ బీఆర్‌ఎస్‌లో చేరారు. మాసాయిపేటలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాయమాటలు చెప్పి సీత్యాను కాంగ్రెస్ నాయకులు పార్టీలో చేర్చుకున్న కొన్ని గంటల వ్యవధిలోనే సీత్యానాయక్ బీఆర్‌ఎస్ పార్టీలో చేరారని, ప్రతిపక్షాల మాటలు నమ్మే పరిస్థితులు లేవని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.

## నేడు శివ్వంపేటలో బీఆర్‌ఎస్ ప్రచారం

శివ్వంపేట, అక్టోబర్ 31: శివ్వంపేట మండలంలో నేడు (బుధవారం) మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తామనిని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్ పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు మండలంలోని దంతాన్‌పల్లిలో, 11 గంటలకు కొంతాన్‌పల్లి, 12 గంటలకు గుండ్లపల్లి, 12:30 గంటలకు మల్లుపల్లి, మధ్యాహ్నం ఒంటి గంటకు దొంతి, 3 గంటలకు శభాశ్‌పల్లి, 4 గంటలకు పోతారం, 4:30 గంటలకు తుపాకులపల్లి, 5 గంటలకు పరికిబండ, 5:30 గంటలకు గౌతోజిగూడ గ్రామాల్లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలసి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రాగౌడ్, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీటీసీ మహేశ్ గుప్తా, జడ్పీ కోఆప్షన్ మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ గౌర్రె వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్రజాస్వామ్యంలో దాడులు సరికాదు

అల్లాదుర్గం, అక్టోబర్31: ప్రజాస్వామ్యంలో దాడులు, హత్యాయత్నాలు సరికాదని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బ్రహ్మం అన్నారు. ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నిరాశలో కాంగ్రెస్ పార్టీ భౌతికదాడులకు దిగుతున్నదని మండిపడ్డారు. రాజకీయంగా ఎదుర్కొలేక దాడులకు తెరలేపుతున్నారని, దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పెంటయ్య, బేతయ్య, సాయిలు, లక్ష్మయ్య, వెంకయ్య పాల్గొన్నారు.

# జిల్లాలో 388 కొనుగోలు కేంద్రాలు

- రైతులకు మద్దతు ధర చెల్లించేందుకు కొనుగోలు కేంద్రాలు: జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో శంకర్

మెదక్ రూరల్/అల్లాదుర్గం, అక్టోబర్ 31: ప్రభుత్వం రైతులకు మద్దతు ధర చెల్లించేందుకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నదని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ అన్నారు. సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ పండించిన ధాన్యాన్ని రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దని, జిల్లాలో 388 కొనుగోలు కేంద్రాలను అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి కేంద్రంలో కనీసం అవసరమైన టార్పాలిన్లు కవర్లు, సంచులు, ప్యాడీక్లీనర్, తేమను కొలిచే యంత్రాలు డిజిటల్ కాంటా అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు ఏ గ్రేడ్ ధాన్యంకు రూ.2203, సాధారణ రకం రూ. 2183 మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించిందని, 17 శాతం తేమ మించకుండా ఎఫ్‌సీఐ ప్రమాణాలకనుగుణంగా నాణ్యమైన ధాన్యం కేంద్రాలకు తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమాంలో ఏఈవో శేఖర్, సీఈవో సాయికుమార్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

### చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం..

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలిచి అన్ని విధాలా ఆదుకుంటుందని ఎంపీడీవో శంకర్ అన్నారు. మంగళవారం మండంలోని కాయిదంపల్లి, సీతానగర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాల వద్ద ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎమ్ నాగరాజు, తదితరులు ఉన్నారు.

## నాబార్డు సేవలను వినియోగించుకోవాలి



మహిళలకు ధృవపత్రాలు అందజేస్తున్న ఏజీఎం సీసీల్ తిమోతి

పెద్దశంకరంపేట, అక్టోబర్ 31: నాబార్డు సేవలను వినియోగించుకోవాలి ఉమ్మడి జిల్లా ఏజీఎం సీసీల్ తిమోతి అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని 'స్త్రీ శక్తి భవన్'లో నాబార్డు ఆధ్వర్యంలో మగ్గం వర్క్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఆయన ధృవపత్రాలు అందజేశారు. మహిళలు ఆర్థికంగా బలపడి, తన కాళ్లపై తను నిలబడాలని, ఏ ఒక్కరిపై ఆధారపడకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ అతుల్ కుమార్, నవీన్‌కుమార్, ఐకేపీ ఏపీఎం గోపాల్, సీసీలు నిరంజన్, యోహాన్, సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆడ పిల్లలను చదివిద్దాం.. రక్షిద్దాం

చేగుంట, అక్టోబర్ 31: ఆడ పిల్లలను చదివిద్దాం.. రక్షించుకుందామని మెదక్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ జెండర్ స్పెషలిస్ట్ నాగమణి పేర్కొన్నారు. చేగుంటలోని మండల పరిషత్ కార్యాయలంలో మంగళవారం ఐసీడీఎస్ సూపర్ వైజర్ సువర్ణ ఆధ్వర్యంలో బాలికలపై ఆత్యాచారాలు, వరకట్నం వేధింపులు, బాలికల అక్రమ రవాణా వంటి వాటిని అరికట్టేందకు తీసుకునే చర్యలపై, అత్యవసర సమయంలో హెల్ప్ లైన్స్ 181, 1098, 100 టోల్‌ఫ్రీ నంబర్స్‌లను ఎలా ఉపయోగించుకోవాలనే పలు అంశాలపై అంగన్‌వాడీ టీచర్లుకు నాగమణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానం

- 10వ తేదీ వరకు గడువు
- శిక్షణ కాలం మూడు నెలలు

మెదక్ అర్బన్, అక్టోబర్31: నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వడానికి బ్యాచ్ తరగతులు ప్రారంభమయ్యాయి. మరికొన్ని సీట్లు భర్తీకానందున నవంబర్ 10వ తేదీ వరకు గడువు పొడిగించారు. ఆసక్తి గల అభ్యర్థులు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం మెదక్‌లో దరఖాస్తులు సమర్పించాలని జిల్లా యుజవన క్రీడా అధికారి నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్స్ కోర్సు ఎంఎస్ ఆఫీస్, కంప్యూటర్ సీ లాంగ్వేజ్, సీసీ టీవీ రిపేర్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, మొబైల్ సర్వీసింగ్, రిపేర్, మగ్గం వర్క్‌ల్లో శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తయ్యాక పరీక్ష నిర్వహించి ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్ అందింస్తామని పేర్కొన్నారు. కోర్సు శిక్షణ కాలం మూడు నెలల పాటు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## జిల్లాలో నెల రోజులు పోలీస్ యాక్ట్

మెదక్ అర్బన్, అక్టోబర్ 31: జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకొని నెల రోజుల పాటు నవంబర్1వ తేదీ నుంచి 30 వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులు వారికి సహకరించాలని ఎస్పీ కోరారు.

## ఈవీఎంలపై శిక్షణా తరగతులు

మెదక్ రూరల్, అక్టోబర్ 31: వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం మంగళవారం మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈవీఎంలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. పీఓ, ఏపీవోలకు ఈవీఎంలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం, వీవీ ప్యాంట్లపై తదితర అంశాలపై సుమారు 530 మందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెదక్ రిటర్నింగ్ అధికారి ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూ శిక్షణలో పాల్గొన్న పీఓ, ఏపీవోలు పూర్తి స్థాయిలో అన్ని విషయాలపై అవగాహన పొందాలని, ఎలాంటి సందేహాలు లేకుండా నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రక్తదానం అభినందనీయం

అల్లాదుర్గం, అక్టోబర్ 31: రక్తదానం అభినందనీయమని అల్లాదుర్గం సీఐ జార్జ్ అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేట్‌లో పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు రక్తదానం చేశారు. అల్లాదుర్గ్ ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, టేక్మాల్ ఎస్సై రమేశ్, ఎఎస్సై విఠల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వే బ్రిడ్జి కాంటాల ఆకస్మిక తనిఖీ

చిన్నశంకరంపేట, అక్టోబర్31: చిన్నశంకరంపేట గ్రామశివారులోని వే బ్రిడ్జి కాంటాలను మంగళవారం జిల్లా తూనికల కొలతల అధికారి సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలాజీ కాంటాను తనిఖీ చేయగా, అందులో తూకంలో రెండు క్వింటాళ్లు తేడా వస్తున్నట్లు గుర్తించారు. జై హనుమాన్ కాంటాలో 50 కిలోలు తేడా వస్తున్నట్లు గుర్తించారు. తూకంలో అవకతవకు ఉన్నట్లు గుర్తించి ఆ రెండింటిని సీజ్ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకే జిల్లా వ్యాప్తంగా తనిఖీలను నిర్వహిస్తున్నామని సుధాకర్ వెల్లడించారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

పెద్దశంకరంపేట, అక్టోబర్ 31: ఓటర్లు ఓటు హక్కును నిర్భయంగా వినియోగహించుకోవాలని మంగళవారం అంగన్వాడీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. పెద్దశంకరంపేటలో విద్యార్థులు, అంగన్వాడీ టీచర్లతో కలిసి ఓటుపై అవగాహన ర్యాలీని నిర్వహించారు.

## కోనాయిపల్లిలో ఘనంగా రుద్రాభిషేకం

మనోహరాబాద్, అక్టోబర్ 31: మనోహరాబాద్ మండలం కోనాయిపల్లి పీటీలోని హనుమాన్ దేవాలయం పునః ప్రతిష్టాపన నిర్వహించిన 42 వ రోజు కావడంతో మంగళవారం రుద్రాభిషేకం, యజ్ఞాలు, హోమాలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.